7

సాక్షి నారాయణపేట

సోమవారం ၊ 18 ၊ నవంబర్ ၊ 2024

గరిష్ఠం/కనిష్ఠం
33.5 /16.8

వాతావరణం
జిల్లాలో వాతావరణం రోజంతా సాధారణంగా ఉంటుంది. రాత్రి సమయంలో చలితో పాటు పొగమంచు కురుస్తుంది.

9 రోజులు.. 68శాతం

జిల్లాలో వడివడిగా సమగ్ర కుటుంబ సర్వే



ఈ ఫొటోలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్ పేరు భారతి. సమగ్ర కుటుంబ సర్వేలో ఆమెకు మద్దెలబీడు గ్రామంలో 150 కుటుంబాలను సర్వే చేసేందుకు కేటాయించారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించిన సర్వేలో 87 కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. ఒక్క కుటుంబ సమాచారం సర్వే ఫామ్‌లో నమోదు చేసేందుకు 25 నుంచి 30 నిమిషాల సమయం పడుతుంది. సర్వేలో స్వరాష్ట్రంలో వలసలకు ప్రత్యేక కాలం లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు స్థానికంగానే ఉంటున్నట్లు నమోదు చేయిస్తున్నారు. పలువురు లబ్ధిదారులు వివరాలను నమోదు చేయించిన తర్వాత మార్పులు చేర్పుల కోసం తిరిగి వారిని సంప్రదిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడిగానే ఉన్న కుటుంబాలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వివాహమైన వారు ఇంటికి అతికించిన ఎనుమరేషన్ బ్లాక్ ఇంటి సంఖ్యకు బై నెంబర్ల వేయించుకుని సర్వే వివరాలను నమోదు చేయిస్తున్నారని తెలిసింది.

సామాన్యుడికి లాభమేంటి

ఈ ఫొటోలో కనిపిస్తున్నది నారాయణపేట పట్టణంలోని దూల్‌పేటకు చెందిన అనిల్. ఆదివారం ఇంటింటి సర్వేకు వచ్చిన అధికారితో.. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వల్ల సామాన్యుడికి ఎలాంటి ప్రయోజనం జరుగుతుందో చెప్పాలని కోరారు. సర్వేలో అడిగిన 56 ప్రశ్నలతో సామాన్యులకు ఎలాంటి లాభం జరుగుతుందో వివరించాలని వారిని ప్రశ్నించడం కనిపించింది.





మరికల్‌లో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న సీపీఓ యోగానంద్

- గ్రామీణ ప్రాంతాల్లో వివరాల సేకరణకు అవస్థలు
- 1,55,999 కుటుంబాలకు.. 1,06,326 కుటుంబాల వివరాల సేకరణ
- ప్రతిరోజు కలెక్టర్, జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో ఇప్పటివరకు 68శాతం పూర్తయ్యింది. ఈ నెల 9వ తేదీన ఈ సర్వే ప్రారంభం అయ్యింది. జిల్లాలో మొత్తం 1,55,999 కుటుంబాలు ఉండగా 1,06,326 కుటుంబాల వివరాలను ఇన్యుమరేటర్లు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1201 ఈ బ్లాకులకు గాను 1181 మంది ఎన్యుమరేటర్లు, 118 మంది సూపర్‌వైజర్లు విధుల్లోకి వెళ్లి తొలి రోజు 6,452 కుటుంబాలతో 75 ప్రశ్నలతో సమాచారాన్ని సేకరించగా.. 9 రోజులుగా చేపడుతున్న సర్వేతో 68 శాతానికి నమోదైంది. ఈ సర్వే పై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని అడుగుతూ సర్వే రిపోర్టును ప్రతి రోజు సాయంత్రం 5.30 గంటల వరకు తెప్పించుకుంటున్నారు. ఆ నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. వంద శాతం సర్వే చేపట్టేందుకు ఇంకా 8 రోజుల సమయం ఉంది.

ఆదివారం 6 శాతమే నమోదు

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9 నుంచి ఇంటింటా సర్వేను చేపట్టారు. తొలి రోజు 6,452 కుటుంబాలను సర్వే చేయడంతో 4.1 శాతం నమోదైంది. 10వ తేదీ నాటికి 17,436 కుటుంబాలు (11.2 శాతం), 11 నాటికి 29,842 (19.1 శాతం) కుటుంబాల సర్వే పూర్తయ్యింది. 12, 13వ తేదీల నాటికి 43,708 కుటుంబాల సర్వే చేయడంతో మొత్తంగా 28 శాతానికి చేరుకుంది. 14వ తేదీ వరకు 71,340 కుటుంబాలు, 15 వరకు 83,452, 16 వరకు 97,550, 17న 1,06,326 కుటుంబాల సర్వే పూర్తి కావడంతో మొత్తంగా 68.2 శాతానికి చేరుకుంది. అయితే ఆదివారం కేవలం 6 శాతం మాత్రమే సర్వే జరిగిందని చెప్పవచ్చు.

జిల్లాలో మండలాల వారీగా సర్వే వివరాలిలా..

మండలం	మొత్తం కుటుంబాలు	సర్వే పూర్తయ్యింది	సర్వే శాతం
కృష్ణ	7,269	5,830	80
మాగనూర్	7283	5,557	76
మక్తల్	13,894	9,843	70
మరికల్	10641	7,374	69
ధన్వాడ	8950	6,192	69
దామరగిద్ద	15,069	10,272	68
ఊట్కూర్	14,773	9,834	66
నారాయణపేట	15,113	10,023	66
మద్దూర్/కొత్తపల్లి	18,156	11,952	65
నర్వ	10,146	6,012	59
కొస్గి/గుండుమాల్	12,241	7,153	58
మొత్తం	1,33,535	90,042	

మున్సిపాలిటీల వారీగా...

మున్సిపాలిటీ	మొత్తం కుటుంబాలు	సర్వే పూర్తయ్యింది	సర్వే శాతం
మక్తల్	6,276	4903	78
నారాయణపేట	10,637	7991	75
కోస్గి	5551	3,990	61
మొత్తం	22,464	16,284	68

పలు అంశాలపై అనాసక్తి

భూమిలేని వారికి సంబంధించి పది ప్రశ్నలకు ప్రజలు ఎలాంటి సమాధానాలు చెప్పడంలేదు . రిజర్వేషన్లపై ప్రశ్నలకు చాలావరకు సమాధానం చెప్పడానికి అనాసక్తి చూపిస్తున్నారు. విద్య, ఉద్యోగ ప్రయోజనాలు, ఐదు సంవత్సరాలలో ప్రభుత్వం నుంచి పొందిన పథకాల పేర్లు అన్న ప్రశ్నకు చాలామంది సామాన్యుల నుంచి సమాధానం రావడం లేదు. ఇల్లు, ఉపాధి, ఉద్యోగం, చేయడానికి కులవృత్తి ఎలాంటి అవకాశాలు లేని వారు ప్రభుత్వం నుండి పొందిన లబ్ధి, మహిళలకు ఆధార్ కార్డు ఉండి ఉచిత బస్సు ప్రయాణం పథకం పొందుతున్నారని దాన్నే ప్రభుత్వ లబ్ధిగా సర్వేలో రాసుకుంటున్నారు. రాజకీయ నేపథ్యమనేది ప్రజాప్రతినిధులకు సంబంధించినవి.. అది సామాన్యులకు సంబంధంలేని అంశంగా చాలామటుకు భావిస్తున్నారు.

వంద శాతం పూర్తి చేస్తాం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా కుటుంబ సమగ్ర సర్వేను కలెక్టర్ దిశానిర్దేశంతో వంద శాతం పూర్తి చేస్తాం. ముందుగా ఈ నెల 22 వరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రారంభించాం. కాగా రెండు, మూడు రోజులు అటు ఇటుగా పూర్తి అవుతుంది.

– యోగానంద్, సీపీఓ, నారాయణపేట

ఎన్యుమరేటర్లకు తప్పని తిప్పలు

ఇంటింటా సమగ్ర సర్వేకు వెళ్లే ఎన్యుమరేటర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటలు దాటితే ప్రజలు చాలామటుకు కూలి పనులకు, పొలం పనులకు వెళ్తున్నారు. ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు వెళ్తే తప్ప ఉండడం లేదు. సాయంత్రం వేళల్లో వెళ్దామంటే 6 గంటల తర్వాత వాళ్లు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇంటి దగ్గర ఉండే వృద్ధులను వివరాలను అడిగేందుకు ప్రయత్నిస్తున్నా వారితో సరైన సమాధానాలు రాకపోవడంతో ఏదో ఒకటి రాసుకొచ్చే పరిస్థితి ఉందని తెలుస్తోంది.

మొదటి రోజు ప్రశాంతం



జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

గ్రూప్-3 పరీక్షకు 2,353 మంది హాజరు

- 4024 మంది అభ్యర్థులకు 1,671 మంది గైర్హాజరు
- సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారికి అనుమతి నిరాకరణ
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట రూరల్: జిల్లాలో టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం జరిగిన మొదటి సెషన్ పరీక్షకు జిల్లా కేంద్రంలో 13 సెంటర్లలో మొత్తం 4024 మంది అభ్యర్థులకుగాను 2353 మంది హాజరు కాగా 1671 మంది గైర్హాజరు అయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం సెషన్ పరీక్షకు 2354 మంది అభ్యర్థులు హాజరవ్వగా 1670 మంది గైర్హాజరు అయ్యారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ఉదయం 8.30 గంటలకే కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించగా చివరి క్షణం వరకు మురుకులు పరుగులు పెడుతూనే అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. చాలా పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు గడువు సమయం ముగిసిన తర్వాత కేంద్రానికి రావడంతో లోపలికి అనుమతించలేదు. బతిమిలాడిన ప్రయోజనం లేకపోవడంతో వెనుతిరగాల్సిన అవసరం ఏర్పడింది. మహిళా అభ్యర్థులతో వచ్చిన బంధువులు వారి చిన్నారులను ఆడిస్తూ కేంద్రం బయట కనిపించారు.

పకడ్బందీగా..

పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ముందుగా చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ హాజరు, గైర్హాజరు వివరాలపై కళాశాల ప్రిన్సిపాల్ మెర్సి వసంతను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని సీసీ కెమెరాలను అమర్చారని అడిగి తెలుసుకున్నారు. తర్వాత రవితేజ టాలెంట్ స్కూల్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల హాజరు శాతం నమోదు గురించి ఆ కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌తోతో మాట్లాడారు. పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. చివరగా జిల్లా కేంద్రానికి సమీపంలోని ద్వారక పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని సైతం ఆమె పరిశీలించి అక్కడి వసతి సౌకర్యాలను పరిశీలించారు. పరీక్ష సమయంలో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతించకూడదని అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే పరీక్ష కేంద్రంలోకి వెళ్లేలా చూడాలన్నారు. అభ్యర్థుల ఫోన్లు, వాచ్‌లు ఎక్కడ పెడుతున్నారని ప్రశ్నించగా కేంద్రం బయట ప్రత్యేకంగా ఒక కౌంటర్ ఏర్పాటు చేశామని, అక్కడే అభ్యర్థుల వస్తు సామగ్రిని భద్రపరచినట్లు సిఎస్ తెలిపారు.

బందోబస్తు పరిశీలన

జిల్లా కేంద్రంలోని సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, బ్రిలియంట్, సోషల్ వెల్ఫేర్ కాలేజ్ పరీక్షా కేంద్రాలను, పోలీసు బందోబస్తును ఎస్పీ యోగేష్ గౌతమ్ పరిశీలించారు. అధికారులు, సిబ్బంది అందరు బాధ్యతగా పని చేయాలని పరీక్ష పత్రాలు స్ట్రాంగ్ రూంకు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ ఎన్ లింగయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.



పరీక్ష కేంద్రాలలో బందోబస్తుపై అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

ఆలస్యంగా వచ్చారు.. మిస్ అయ్యారు



నెలన్నర బిడ్డతో బస్ షెల్టర్‌లో కూర్చున్న అభ్యర్థి సుజాత



పరీక్షకు హాజరైన భర్త విజయ్‌తో.. అనుమతి పొందని భార్య దీపిక

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన గ్రూప్-3 పరీక్షకు పలువురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో కేంద్రంలోకి అనుమతి లభించలేదు. కలెక్టర్ తనిఖీకి వచ్చిన సమయంలోను ఆమెను సంప్రదించగా నిబంధనల ప్రకారం జరుగుతాయని చెప్పి లోపలికి వెళ్లిపోయారు. మొత్తంగా 16మంది అభ్యర్థులు పరీక్ష రాయలేకపోయారు.

⇨ ధన్వాడకు చెందిన సుజాత నెలన్నర కూతురితో కృష్ణగోకులం పాఠశాలలోని పరీక్ష రాసేందుకు రాగా సమయం అయిపోయిందని సిబ్బంది లోపలికి అనుమతించలేదు. కనీసం మధ్యాహ్నం పరీక్ష కోసం వేచి చూడటానికి కేంద్రం పరిసరాల్లో కూర్చుంటుండగా పోలీసులు అనుమతించలేదు. దగ్గరలోని అంబేద్కర్ సర్కిల్ బస్ షెల్టర్‌లో గంటల తరబడి కూర్చోవాల్సి వచ్చింది. మధ్యాహ్నం 4వ తరగతి చదువుతున్న తన అక్క కూతురు హాన్సికకు తన నెలన్నర కూతురుని ఇచ్చి పరీక్షకు వెళ్లింది.

⇨ శిశుమందిర్ స్కూల్ వద్ద నలుగురు అభ్యర్థులు సెంటర్ చిరునామా ఆలస్యం కావడంతో పరీక్షకు హాజరుకాలేకపోయారు.

⇨ మక్తల్‌కు చెందిన భార్యభర్తలు దీపిక, విజయ్ ఇరువురిలో సీఎస్ఆర్ డీసీలో భార్యకు, ప్రభుత్వ బాలికల స్కూల్‌లో భర్తకు కేంద్రాలు అలాట్ అయ్యాయి. బైక్‌పై ముందుగా భార్యను వదిలి తన సెంటర్‌కు భర్త వెళ్లాడు. అయితే సమయం అయిపోయిందని దీపికను అనుమతించకపోగా ఈమె తర్వాత వెళ్లిన విజయ్‌కు మాత్రం పరీక్ష రాసే అవకాశం దొరికింది. నిర్వాహకులు ఒక్కో సెంటర్‌లో ఒక్కోతీరుగా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి.

కార్మికులకు రూ.12వేల జీవనభృతి ఇవ్వాలి

నారాయణపేట: వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు జీవనభృతిని ఇవ్వాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సలీమ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం రేంత్‌రెడ్డి గతేడాది ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను ఇస్తామని, వ్యవసాయ కూలీలకు జీవన భృతి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. వ్యవసాయ రంగంలో సన్న, చిన్న కారు రైతులు 50 శాతానికి పైగా వ్యవసాయ కూలీలు వ్యవసాయ ఉత్పత్తిలో మహిళా కార్మికులు అధికంగా ఉన్నారన్నారు. బీడీ, చేనేత కల్లుగీత కార్మికులకు ఇచ్చే విధంగా వ్యవసాయ కార్మికులకు నెలకు రెండు వేల పెన్షన్ వర్తింపజేయాలని, అసరా పింఛన్లను రూ.4 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లాలో వ్యవసాయ కార్మికులను గ్రామాల్లో పట్టణాల్లో సమీకరించి నవంబర్ 20 నుండి 30 తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, 25న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు, 30న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రజా, రైతు సంఘం నాయకులు హాజీ మలంగ్, వెంకట్ రాములు, నరసింహులు, కనక రాయుడు, మల్లేష్ , రాజు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సలీమ్

న్యూస్‌రీల్

నేడు పాలమూరుకు బీసీ కమిషన్ రాక

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): స్థానిక సంస్థల వారీగా కల్పించే అవసరమైన రిజర్వేషన్ల దమాషా పేర్కొనే విషయంపై సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో డెడికేటెడ్ బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి.సైదులు హాజరవుతారన్నారు. ఆయా కులాల స్థితిగతులపై డెడికేటెడ్ బీసీ కమిషన్‌కు అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చన్నారు. స్థానిక సంస్థలకు అవసరమైన రిజర్వేషన్లను దమాషా ప్రకారం కల్పించేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీలు, బీసీ సంఘాలు, ప్రజలు సలహాలు, అభ్యర్థనలు, ఆక్షేపణలను కమిషన్‌కు సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలతో సమర్పించవచ్చని చెప్పారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి



నారాయణపేట టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల ఫీజులు అరికట్టాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వర్, ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పీవైఎల్ జిల్లా కార్యాలయంలో ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రుల ఫీజులు అరికట్టాలని, ప్రభుత్వ ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపరచాలని ఉద్యమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యం ప్రజల దగ్గర అనేక టెస్టుల పేరుతో ప్రజల దగ్గర ఫీజులు దోపిడీ చేస్తున్నాయన్నారు.

ఎండు మిర్చికి ధరాఘాతం

- గత రెండేళ్లుగా తెగుళ్లు సోకి సగానికి తగ్గిన దిగుబడి
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పడిపోయిన సాగు విస్తీర్ణం
- ఈ ఏడాది ఆశాజనకంగా దిగుబడి.. ధరలపైనే రైతుల దిగాలు
- మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో మరిన్ని తిప్పలు



మానవపాడు మండలం గోకులపాడు శివారులో ఎండుమిర్చి సాగు

గద్వాల/గద్వాల వ్యవసాయం: ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా దాదాపు 44 వేల ఎకరాల్లో ఎండుమిర్చి పంట సాగు చేశారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పంట చేతికి రాగా, మరికొన్ని ప్రాంతాల్లో నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో చేతికి రానుంది. ఇదిలా ఉంటే.. గడిచిన రెండేళ్లుగా త్రిప్స్ వంటి వివిధ రకాల తెగుళ్లకు తోడు తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంట దిగుబడులపై గణనీయంగా ప్రభావం చూపి దెబ్బతీయగా, మరోవైపు గిట్టుబాటు ధర సైతం లభించలేదు. దీంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికీ గోదాంలలో నిల్వ ఉంచుకుని ఎదురు చూస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇదే క్రమంలో సాగువిస్తీర్ణం గతేడాది కంటే సగానికి పడిపోయింది.

సంప్రదాయ పంటలకు భిన్నంగా..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గడిచిన 14 ఏళ్లుగా రైతులు సంప్రదాయ పంటలకు భిన్నంగా కమర్షియల్ పంటల సాగుపై దృష్టిసారించారు. ఈ క్రమంలో ఎండు మిర్చి సాగుపై దృష్టిసారిస్తున్నారు. కొంత వ్యయప్రయాసంతో కూడుకున్నది అయినప్పటికీ వాతావరణం అనుకూలించి పంట దిగుబడులు ఆశాజనకంగా చేతికి వస్తే పత్తి కంటే కూడా మిర్చికే మంచి ధరలు లభిస్తాయన్న ఉద్దేశంతో ఈ పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.60 – 70 వేల వరకు సాగు ఖర్చులు అవుతుండగా దిగుబడి రూపంలో ఎకరాకు 20- 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కరుణ, సూపర్‌టెన్, జత్రి, కావేరి, తేజచిల్లి, బ్యాడిగ తదితర రకాలకు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉండటంతో వీటినే ఎక్కువగా సాగు చేస్తున్నారు.

గిట్టుబాటు ధరేది..?

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎండు మిర్చి కోతకు వచ్చింది. పంట కోత పూర్తయిన తర్వాత కల్లాలో ఎండబెట్టి, విక్రయిస్తారు. అయితే ఈసారి చాలా ప్రాంతాల్లో పంట బాగుందనే అభిప్రాయాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఆశించిన మేర దిగుబడులు వస్తాయని భావిస్తున్నారు. కాగా ధరలు ఎలా ఉంటాయో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ వెరైటీలు క్వింటాల్‌కు కనీసం రూ.25 వేలు వస్తేనే గిట్టుబాటు అవుతుంది. ఇక మరికొన్ని వెరైటీలకు రూ.45 వేల నుంచి రూ.50 వేలు వస్తేనే ఆర్థికంగా ప్రయోజనం ఉంటుంది.

⇨ మార్కెటింగ్ సౌకర్యం లేక ఏపీ, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల మార్కెట్లకు తీసుకెళ్లి ఎండుమిర్చిని రైతులు విక్రయించాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం గద్వాల మార్కెట్ యార్డులో కొనుగోళ్లు ప్రారంభించినా మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఇప్పటికైనా ఎండుమిర్చికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రెండేళ్లు వెంటాడిన కష్టాలు..

2022- 23, 2023- 24లో ఉమ్మడి జిల్లాలో సుమారు 75 వేల ఎకరాల్లో ఎండుమిర్చి సాగు చేయగా.. త్రిప్స్, ఎండు, మడత తెగుళ్లు, జెమిని వైరస్ ఆశించడంతో ఎకరాకు 15 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 8 నుంచి 12 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. 2023–24లో జోగుళాంబ గద్వాల జిల్లాలో అత్యధికంగా 65,113 ఎకరాల్లో సాగు చేయగా.. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడులు సగానికి తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇదే సమయంలో బహిరంగా మార్కెట్‌లో ధరలు కూడా పడిపోయాయి. ఎండుమిర్చిలో వెరైటీని బట్టి మార్కెట్‌లో ధరలు లభిస్తాయి. క్వింటాలు రూ.20 వేలు పలకాల్సిన కొన్ని వెరైటీలకు రూ.13 వేల నుంచి రూ.15 వేలు, రూ.25 వేలు పలకాల్సిన వెరైటీలు రూ.16 వేల నుంచి రూ.18 వేలు, రూ.45 నుంచి రూ.50 వేలు రావాల్సిన వెరైటీలకు రూ.35 వేల నుంచి రూ.40 వేలు వచ్చాయి. గతంలో 75 వేల ఎకరాలు సాగు చేయగా.. ఈసారి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 44 వేల ఎకరాల్లో మాత్రమే పంటను సాగుచేశారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.

ఉమ్మడి జిల్లాలో ఎండు మిర్చి సాగు వివరాలు

34,073 జోగుళాంబ గద్వాల	7,585 నాగర్‌కర్నూల్
2,022 వనపర్తి	428 నారాయణపేట
100 మహబూబ్‌నగర్	విస్తీర్ణం (ఎకరాల్లో)

దిగుబడులు బాగున్నాయి



గడిచిన రెండేళ్ల నుంచి తెగుళ్లు, వర్షాభావ పరిస్థితులతో ఎండుమిర్చి దిగుబడులు తగ్గాయి. అయితే, ఈ ఏడాది అంచనా కన్నా సాగు తగ్గినా.. పంట బాగా ఉంది. దిగుబడులు ఆశించిన మేర వచ్చే అవకాశం ఉంది. ఎండుమిర్చికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించే విషయాన్ని మార్కెటింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ఎంఏ అక్బర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

గిట్టుబాటు కల్పిస్తేనే..



ఏటా ఎండుమిర్చి సాగు చేస్తాను. రెండేళ్ల నుంచి దిగుబడులు, ధరలు తగ్గినా.. పెట్టుబడులు మాత్రం పెరిగాయి. ఈ ఏడాది పంట బాగా ఉంది. గిట్టుబాటు ధరలు వస్తేనే ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుంది.

– బోయ వెంకటేశ్వర్లు, రైతు, చిన్నిపాడు, మానవపాడు మండలం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

జడ్చర్ల: జడ్చర్ల శివారులోని మిడ్‌ల్యాండ్ ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శోభ(32)అనే మహిళ దుర్మరణం చెందింది. రోడ్డు దాటుతున్న ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కారు ఢీకొని మహిళ..



మృతిచెందిన నిరంజనమ్మ

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్ గ్రామంలో ఆదివారం కారు ఢీకొని ఓమహిళ మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కుడికిల్ల గ్రామానికి చెందిన బోయ నిరంజనమ్మ(58) అనే మహిళా ముష్టిపల్లి గ్రామానికి శుక్రవారం గౌరినోముల కోసం బంధువుల ఇంటికెళ్లింది. ఆదివారం ఉదయం ఆమె కల్వకోల్ నుంచి కుడికిల్ల గ్రామానికి కాలినడకన వెళ్తుంది. హైదరాబాద్ నుంచి సోమశిల వెళ్తున్న కారు కుడికిల్ల స్టేజీ సమీపంలో నిరంజనమ్మను ఢీకొట్టింది. ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు కల్వకోల్ స్టేజీవద్ద శవంతో ఆందోళన చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి నచ్చజెప్పారు. దీంతో వారు ఆందోళనను విరమించారు. మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నారు. మృతురాలి బంధువులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పెద్దకొత్తపల్లి పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త నర్సయ్య, కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు.. నాగర్‌కర్నూల్‌కు చెందిన కృష్ణప్రసాద్(32) ఈనెల 10న బైక్‌పై నాగనూలు గ్రామానికి వెళ్తూ కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కోలుకోలేక అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



తెల్లు రాముడు (ఫైల్)

పాన్‌గల్: మనస్తాపంతో మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో వెలుగు చూసింది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కదిరెపాడు గ్రామానికి చెందిన తెలుగు రాముడు(36) మేస్త్రీ పని చేసేవాడు. రెండు నెలల క్రితం పనుల కోసం హైదరాబాద్ వెళ్లాడు. ఐదు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. భార్యాభర్తల మధ్య ఘర్షణతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన రాముడు గ్రామ శివారులోని మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఉరేసుకోవడంతో శవం పూర్తిగా కుళ్లిపోయింది. సంఘటనాస్థలంలోని పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి..



ఇటవోని భీమప్ప (ఫైల్)

మద్దూరు: జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాంలాల్ కథనం మేరకు ..పల్లెగడ్డ గ్రామానికి చెందిన ఇటవోని భీమప్ప(46) గత కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈక్రమంలో ఆర్థిక పరిస్థితి క్షీణించడంతో కుటుంబంలో తరుచూ గొడవలు జరిగేవి. శనివారం భార్య, పిల్లలు శుభకార్యం కోసం వేరు ఊరి వెళ్లారు. తాగిన మైకంలో భీమప్ప ఇంట్లో ఉన్న పురుగు మందు సేవించాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్పాట్ అడ్మిషన్లు

జడ్చర్ల: స్థానిక బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎమ్మెస్సీ వృక్షశాస్త్రం కోర్సులో చేరాలనుకునే విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ సుకన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ నిర్వహించిన ప్రవేశ పరీక్ష రాసినవారు, రాయనివారు కూడా అర్హులని అన్నారు. డిగ్రీలో వృక్షశాస్త్రం చదివినవారు కనీసంగా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉంటే సరిపోతుందన్నారు. ఈనెల 20 వరకు విద్యార్థులు సంప్రదించాలని, వివరాలకు 9963536233 నంబర్‌కు కాల్ చేయాలని ఆమె కోరారు.

పరుగులు తీస్తూ..



మహబూబ్‌నగర్‌లో అభ్యర్థిని బైక్‌పై పరీక్ష కేంద్రానికి చేరవేస్తున్న ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య



నారాయణపేటలో..



మహబూబ్‌నగర్‌లో..





మహబూబ్‌నగర్‌లో నీరసంతో సొమ్మసిల్లిన విద్యార్థిని పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్తున్న ఏఎస్‌ఐ వెంకట్రాములు, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు



నారాయణపేటలో..



వనపర్తిలో..

పరీక్ష వేళ..ఇలా

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం జరిగిన గ్రూప్‌-3 పరీక్షకు సకాలంలో హాజరయ్యేందుకు అభ్యర్థులు పరుగులు పెట్టారు. మహిళా అభ్యర్థులు తమ చంటిబిడ్డలను కుటుంబ సభ్యులకు అప్పగించి పరీక్షకు హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లో దాదాపు 6 గంటలకు పైగా తల్లికి దూరంగా ఉన్న చిన్నారులను వారి తండ్రులు, బంధువులు లాలించి, జోలపాడారు. పరీక్ష కేంద్రాల వద్ద చిన్నారులకు పాలు తాగించడం, ఆడించడం, సెల్‌ఫోన్‌తో బుజ్జగించడం వంటి చిత్రాలు కనిపించాయి.

– సాక్షి నెట్‌వర్క్

పిల్లలను లాలిస్తూ..



నారాయణపేటలో..



కొత్తకోటలో..



కొత్తకోట నివేదిత డిగ్రీ, జూనియర్ కళాశాల కేంద్రానికి ఆలస్యంగా వచ్చి ఏఎస్పీ రాందాస్ తేజావత్, సీఐ రాంబాబులను బ్రతిమిలాడుతున్న అభ్యర్థులు



మహబూబ్‌నగర్‌లో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



మహబూబ్‌నగర్‌లో పరీక్ష రాసి బయటికి వస్తున్న అభ్యర్థులు

అక్రమాల గుట్టు రట్టు!

యథేచ్ఛగా క్వారీల తవ్వకాలు



జడ్చర్ల క్వారీలో కొలతలు చేస్తున్న మైనింగ్ అధికారులు (ఫైల్)

- భూగర్భ గనులశాఖ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..
- శ్రీనివాస స్టోన్ క్రషర్‌కు రూ.21.13 కోట్ల జరిమానా
- భవానీ స్టోన్ క్రషర్‌కు షోకాజ్ నోటీసులు

జడ్చర్ల: జడ్చర్ల శివారుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా క్వారీలను కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన స్టోన్ క్రషర్స్‌పై రాష్ట్ర భూగర్భ గనులశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్వారీ యజమానులు వ్యవహరించారని అధికారులు నిగ్గు తేల్చారు. విచారణ అనంతరం సంబంధిత క్వారీ యజమాని గోవర్ధన్‌రెడ్డికి ఏకంగా రూ.21.13 కోట్ల జరిమానా చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు జారీ చేశారు.

ప్రభుత్వ ఖజానాకు గండి..

పట్టణ శివారులోని సర్వేనంబర్ 385/1లో ఒక హెక్టార్‌లో ఉన్న క్వారీని శ్రీనివాస స్టోన్ క్రషర్ 15 ఏళ్లకుగాను లీజుకు తీసుకుంది. లీజు అగ్రిమెంట్ 2021, మార్చి 21న ముగిసింది. ఆ సమయంలో



శ్రీనివాస స్టోన్ క్రషర్ యజమానికి జారీ చేసిన డిమాండ్ నోటీసు

తీసిన క్వారీకి సంబంధించిన సీనరేజ్ రుసుం చెల్లింపులో అక్రమాలు చోటు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అదేవిధంగా పర్మిట్ ఫీజు, డీఎంఎఫ్‌టీ, ఎస్ఎంఈటీ, ఇన్‌కంటాక్స్ వంటి పన్నుల చెల్లింపులు చేయనట్లు తేలింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడినట్లు విచారణలో తేల్చారు.

నిబంధనలు అతిక్రమించి..

క్వారీల తవ్వకాల్లో నిబంధనలు అతిక్రమించినట్లు అనుమానం రావడంతో గత నెల 16న తెలంగాణ రాష్ట్ర మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జడ్చర్ల, శంకరాయపల్లి శివార్లలోని రాతి క్వారీలను జిల్లా మైన్స్ ఏడీ సంజయ్‌కుమార్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రాజు, సర్వేయర్ సుజాత తదితర అధికారుల బృందం డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేలు నిర్వహించారు. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడినట్లు గుర్తించి శ్రీనివాస స్టోన్ క్రషర్ యజమాని ఎం,గోవర్ధన్‌రెడ్డికి మైన్స్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అధికారుల నోటీసులకు జవాబు ఇవ్వకపోవడంతో రూ.21,13,78,448 ప్రభుత్వానికి చెల్లించాల్సిందిగా మైన్స్ అధికారులు డిమాండ్ నోటీసులు జారీ చేశారు.

మరో స్టోన్ క్రషర్‌కు కూడా..

పట్టణ శివారులోని సర్వేనంబర్ 28లో 4.58 హెక్టార్లలో భవాని స్టోన్ క్రషర్ ఆధ్వర్యంలో క్వారీలో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ క్వారీ యజమానికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీటికి జవాబు ఇవ్వకపోతే డిమాండ్ నోటీసులు జారీ చేస్తామని మైన్స్ అధికారులు తెలిపారు. ఇదే క్వారీని అనుసరించి శంకరాయపల్లి పరిధిలోని బేతెల్ క్వారీ గడువు 2020, డిసెంబర్ 31తో ముగిసినట్లు అధికారులు గుర్తించారు.

నోటీసులు జారీ చేశాం..

శ్రీనివాస స్టోన్ క్రషర్ లీజుకు తీసుకున్న క్వారీలో శాఖాపరమైన తనిఖీలు చేపట్టాం. గతంలో గొలుసుతో సర్వే చేయడంతో సరైన ఫలితాలు వచ్చేవి కాదు. ప్రస్తుతం డీజీపీఎస్, ఈటీఎస్ విధానంతో కచ్చితమైన ఫలితాలు వెలువడుతాయి. ఈ ఫలితాల ఆధారంగా రూ.21,13,78,448 జరిమానా చెల్లించాల్సి ఉంది. క్రషర్ యజమానికి డబ్బులు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు జారీ చేశాం.

– సంజయ్‌కుమార్, మైనింగ్ ఏడీ, మహబూబ్‌నగర్

మరిన్ని అక్రమాలు..

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా జడ్చర్ల నుంచి ఉదండాపూర్ వరకు టన్నెల్ నిర్మాణంలో భారీగా రాతి నిల్వలు బయటపడ్డాయి. వీటిని క్రషర్ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా కొల్లగొట్టి రూ.కోట్లు గడించారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఆ దిశగా విచారిస్తే అక్రమార్కుల ఆగడాలు వెలుగులోకి రానున్నాయి. గడువు ముగియడంతో ఆ రెండు క్వారీలు కొనసాగడం లేదని నిర్వాహకులు చెబుతున్నా.. తవ్వకాలు సాగిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అనుమానాలెన్నో..

క్వారీల కేటాయింపు, నిర్వహణలో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. శంకరాయపల్లిలోని సర్వేనంబర్ 385లో 4.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. ఇదే భూమిలో క్వారీలకు అనుమతి తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఆ భూములు ఎవరికి ఇచ్చారు.. ఎవరు వారిని లీజుకు ఇచ్చారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదేవిధంగా స్టోన్ క్రషర్ నిర్వాహకులు నిబంధనల మేరకే తవ్వకాలు చేపట్టారా.. తవ్విన క్వారీకి సంబంధించి ప్రభుత్వానికి ఎంతమేరకు రాయల్టీ చెల్లించారు.. చెల్లించిన పన్నులు తవ్విన సామగ్రికి పోలిక సరిపోయిందా అన్న విషయాలపై మరింత లోతుగా విచారించి చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెళకువలతో నాణ్యమైన దిగుబడి



మిషన్‌తో వరి కోతలు

- ధాన్యాన్ని నిల్వ చేసేటప్పుడు తేమ ఉండకూడదు
- జిల్లా వ్యవసాయ శాఖాధికారి జాన్ సుధాకర్

కోస్గి: వరి కోతలు, కోతల అనంతరం కొన్ని మెళకువలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని నారాయణపేట జిల్లా వ్యవసాయ శాఖాధికారి జాన్ సుధాకర్ సూచించారు. జిల్లాలో వానాకాలంలో సాగుచేసిన వరి పంటలు కోత దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కోతకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పొలంలో 80నుంచి 90శాతం వరి వెన్నులు పసుపు రంగుకు మారుతున్న సమయంలో పంటను కోయాలి. పంట పూర్తిగా ఎండిపోయే వరకు ఉంచకూడదు. ఈదశల్లో గింజల్లో 18–20 శాతం తేమ ఉంటుంది.
- కోత ఆలస్యమైతే గింజ పగుళ్లు వచ్చి ధాన్యం నూకలయ్యే ప్రమాదం.
- గింజల్లో తేమ శాతాన్ని తగ్గించడానికి 2 నుంచి 3 రోజులు వరి మెదను ఎండనివ్వాలి. ఒకవేళ వర్షం కురిసి తడిస్తే 5శాతం ఉప్పు ద్రావణాన్ని వరిపై పిచికారి చేయాలి.
- అవకాశం ఉన్న చోట వరికోత మిషన్లతో కోతలు చేస్తే దుమ్ము, మట్టి ధాన్యంలో కలవకుండా జాగ్రత్త పడాలి. హార్వేస్టర్‌తో పంటను కోసినపుడు రెండు వేర్వేరు రకాల ధాన్యం కలవకుండా చూసుకోవాలి.

కోతల తర్వాత..

- వడ్లను తుర్పార బట్టి చెత్త, మట్టిరాళ్లు వంటివి వేరు చేయాలి.
- తుర్పార బట్టిన వడ్లలో తేమ 12నుంచి 14శాతానికి తగ్గే వరకు ఆరబెట్టాలి. ఈవిధంగా చేయడంతో ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.
- చవుడు నేలల్లో పండించిన ధాన్యాన్ని మంచి ధాన్యంతో కలపరాదు.
- చీడపీడలు ఆశించిన, రంగు మారిన జాగ్రత్తలు తీసుకోవాలి. ధాన్యంతోపాటు కలుపు మొక్కల గింజలు లేకుండా చూడాలి.

ధాన్యం నిల్వలో..


- ధాన్యాన్ని నిల్వ చేసేటప్పుడు అధిక తేమ లేకుండా చూసుకోవాలి.
- పరిశుభ్రమైన గోనె సంచుల్లో ధాన్యం నిల్వచేయాలి. ఎలుకలు, సూక్ష్మ జీవులు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిల్వ చేసే ప్రదేశం తడి లేకుండా బస్తాలకు చిల్లులు లేకుండా చూసుకోవాలి.
- ధాన్యాన్ని ఆశించే కీటకాల నుంచి రక్షణ కోసం పరిసరాల్లో పొగబెట్టాలి.

పత్తికి నిప్పంటించిన దుండగులు

తిమ్మాజీపేట: మండలంలోని మారేపల్లి రైతువేదికలో భద్రపర్చిన పత్తికి గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మారేపల్లికి చెందిన రైతు మల్లయ్య పండించిన 30 క్వింటాళ్ల పత్తిని గ్రామ సమీపంలోని రైతువేదికలో భద్రపరిచారు. గుర్తుతెలియని దుండగులు పత్తికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు రైతు మల్లయ్యకు సమాచారం ఇవ్వడంతో పాటు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే పత్తి మొత్తం కాలి బూడిదయ్యింది. దాదాపు రూ. 2.50లక్షల నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

జూరాలకు 2,800 క్యూసెక్కుల వరద

- నెట్టెంపాడుకు కొనసాగుతున్న నీటిపంపింగ్



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా వరద వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలలో ఒక పంపు ద్వారా నీటి సరఫరా కొనసాగుతున్నట్లు వివరించారు. ఆదివారం జలాశయానికి 2,800 క్యూసెక్కుల వరద వస్తుండగా.. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 72, ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 520, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.521 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు తెలిపారు.

సుంకేసులలో 2 గేట్లు ఎత్తి..

రాజోళి: ఆదివారం సుంకేసుల డ్యాం రెండు గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 10,150 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 7,665 క్యూసెక్కులు దిగువకు, 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో 73 గొర్రెపిల్లలు మృతి

మక్తల్: కుక్కల దాడిలో 73 గొర్రెపిల్లలు మృతిచెందిన ఘటన మక్తల్ పట్టణ శివారు బీసీ కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మక్తల్‌కు చెందిన గట్టునర్సప్ప తన గొర్రెల మందను బీసీ కాలనీలో నిలిపి కంచె ఏర్పాటు చేశాడు. తెల్లవారుజామున కుక్కలు గొర్రెల మందపై దాడిచేయడంతో 73 గొర్రెపిల్లలు మృతిచెందాయి. వాటి విలువ దాదాపు రూ. 2లక్షల వరకు ఉంటుందని.. బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని స్థానికులు కోరారు.



మృతిచెందిన గొర్రెపిల్లలు

రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యం

- అందుకోసం అవసరమైతే మిలిటెంట్ పోరాటం: ఆర్.కృష్ణయ్య



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, వి.హనుమంతరావు తదితరులు

కాచిగూడ: రాజ్యాధికార సాధనే బీసీల అంతిమ లక్ష్యమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆ లక్ష్య సాధన కోసం బీసీలంతా సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అవసరమైతే మిలిటెంట్ పోరాటాలకు కూడా సిద్ధంగా ఉండాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఆదివారం కాచిగూడ అభినంద్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ నెల 25వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించే 'బీసీల సమరభేరి'పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో పూర్తిస్థాయి వాటా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని, బీసీల జనాభాకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సమరభేరి కార్యక్రమానికి పార్టీలకతీతంగా బీసీలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తంగెళ్లముడి నందగోపాల్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, ఉదయ్ నేత, మట్టా జయంతి గౌడ్, సుధాకర్, ర్యాగ రమేష్, రఘుపతి, పరశురామ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం వరికి బోనస్: కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సన్న ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి చెప్పారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సన్నాలకు బోనస్ ఇవ్వడం గొప్ప నిర్ణయమన్నారు. రుణమాఫీ, బోనస్‌ల కింద ప్రభుత్వం ఇచ్చిన డబ్బులను రైతులు పెట్టుబడి కింద ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

మీ సేవ సులభంగా, వేగంగా

దర్జాగా సర్టిఫికెట్ల దందా

- చాలాచోట్ల తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కు
- జేఈఈ మెయిన్‌కు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం తల్లిదండ్రుల అగచాట్లు
- సర్టిఫికెట్‌కు ఇంత అని చెబుతూ వసూళ్లు చేస్తున్నట్టుగా ఆరోపణలు
- సాధారణ రోజుల్లోనూ ఇదే పరిస్థితి అనే ఫిర్యాదులు
- డబ్బులు ఇవ్వకుంటే రోజుల తరబడి పెండింగ్‌లో దరఖాస్తులు

రూ.45 సర్వీసు చార్జీకి రూ.500 నుంచి రూ.4,000 వరకు వసూళ్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలు మీ సేవ కేంద్రాల్లో సర్టిఫికెట్ల దందా కొనసాగుతోంది. సర్వీసు చార్జీల కింద రూ.45 తీసుకోవాల్సి ఉండగా సర్టిఫికెట్‌కు రూ.4,000 వరకు వసూలు చేస్తున్నారు. ఎన్ఐటీలు, ఐఐటీలు, జీఎఫ్‌టీఐలలో ప్రవేశాల కోసం ముందుగా నిర్వహించే జేఈఈ మెయిన్‌కు అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే పిల్లల తల్లిదండ్రులు మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కేంద్రాల నిర్వాహకులు భారీ దందాకు తెరలేపారు. తల్లిదండ్రులకు అవసరం కాబట్టి ప్రాంతాన్ని బట్టి ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.500 నుంచి రూ.1,000 వరకు, కొన్నిచోట్ల రూ.4,000 వరకు కూడా వసూలు చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో కొంతమంది సిబ్బంది, అంటెండర్లతో కుమ్మక్కై ఈ దందా కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జేఈఈ మెయిన్ అని కాకుండా సాధారణ రోజుల్లో సైతం తహశీల్దార్ కార్యాలయాల్లో డబ్బులు తీసుకుని కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ముట్టకపోతే దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచేస్తున్నారని, కొంతకాలం తర్వాత ఏదో ఒక కారణంతో దరఖాస్తును తిరస్కరిస్తున్నారనే ఫిర్యాదులుండటం గమనార్హం.

పౌరసేవకు ఎగనామం

దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకే సర్టిఫికెట్ల జారీని ప్రభుత్వం పౌరసేవల పరిధిలోకి తెచ్చింది. నామమాత్రపు రుసుంతో సర్టిఫికెట్లు జారీ చేసే విధానం ప్రారంభించింది. అయితే దీనిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు తహసీల్ కార్యాలయాల సిబ్బంది, మీ సేవ నిర్వాహకులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. రూ.45 సర్వీసు చార్జీ ఉండే ఓబీసీ సర్టిఫికెట్ కావాలంటే పట్టణ ప్రాంతాల్లోని పలుచోట్ల రూ.4,000 వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,000 వరకు చెల్లించాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. తామే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, ఆ పత్రాలను తహసీల్దార్ కార్యాలయానికి పంపించి, ఆమోదించేలా చూస్తామని చెప్పి వసూళ్లు చేపడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

70 వేల మంది తల్లిదండ్రులపై ప్రభావం

అక్టోబర్ 28వ తేదీన జేఈఈ మెయిన్ నోటిఫికేషన్ జారీ అయింది. అదేరోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 22వ తేదీతో గడువు ముగియనుంది. కాగా ఏదైనా రిజర్వేషన్ వర్తించాలంటే సంబంధిత సర్టిఫికెట్లు కావాల్సిందే. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 95 వేల మంది హాజరు కానుండగా, అందులో దాదాపు 70 వేలమందికి ఈ సర్టిఫికెట్లు అవసరమని అంచనా. దీనిని అసరాగా చేసుకొని మీసేవ కేంద్రాల నిర్వాహకులు, తహసీల్ కార్యాలయాల సిబ్బంది దందాకు తెరతీశారు.

సొమ్ము దండుకున్నా దబాయింపులే

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన శ్రీనివాస్‌కు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తన కుమారుడి కోసం (జేఈఈ మెయిన్‌కు దరఖాస్తు చేసేందుకు) ఓబీసీ సర్టిఫికెట్ అవసరమైంది. దరఖాస్తు చేద్దామని స్థానిక మీ సేవా కేంద్రానికి వెళ్లారు. అక్కడి నిర్వాహకుడు.. 'మేమే దరఖాస్తు చేస్తాం.. దరఖాస్తు ఫారాన్ని మేమే తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చి ఆన్‌లైన్‌లో ఆమోదం పొందేలా చేస్తాం.. అందుకు రూ.1,000 ఖర్చు అవుతుంది'అని చెప్పాడు. రూ.45 దరఖాస్తుకు అంత చెల్లించాలా? అని శ్రీనివాస్.. బాలానగర్‌లోని మరో మీ సేవ కేంద్రానికి వెళ్లి అడగ్గా అక్కడా ఇదే సమాధానం ఎదురైంది. గత్యంతరం లేక రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేశాడు. 12 రోజులు గడిచినా దరఖాస్తును కార్యాలయ సిబ్బంది కనీసం ఓపెన్ కూడా చేయలేదు. మీ సేవ కేంద్రం నిర్వాహకుడిని అడిగితే 'అవుతుందిలే.. చేస్తాం.. తహసీల్దార్ కార్యాలయంలో చేయించే వ్యక్తి బిజీగా ఉన్నాడు..'అంటూ నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు. దీంతో శ్రీనివాస్ నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కిషోర్ అనే వ్యక్తిని కలిశారు. అతను 'మీరు నేరుగా ఎలా వస్తారు..'అంటూ మండిపడ్డాడు. దీంతో శ్రీనివాస్ అక్కడ ఉన్న ఇతర సిబ్బందిని సంప్రదించారు. అంతా కుమ్మక్కే కావడంతో.. 'మీ దరఖాస్తు ఫారమే లేదు. మీరివ్వలేదు..'అంటూ వాళ్లు బుకాయించారు. రెండురోజులు తిరిగి విసిగిపోయిన శ్రీనివాస్ చివరకు తహసీల్దార్‌ను కలిసి పరిస్థితి వివరించాడు. ఆన్‌లైన్ ఫారం ప్రింట్ తీసి ఫైల్ సిద్ధం చేయాలని తహసీల్దార్ కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. అయినా వారు పలు కొర్రీలు పెట్టారు. దీంతో శ్రీనివాస్ మళ్లీ తహసీల్దార్‌ను కలవడంతో ఎట్టకేలకు సర్టిఫికెట్ జారీ అయ్యింది.

అబద్ధాల పోటీ పెడితే.. మోదీదే మొదటి స్థానం

- మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు
- కేంద్రం బీజేపీయేతర ప్రభుత్వాలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోంది
- తెలంగాణలో రుణమాఫీ కింద రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహారాష్ట్రలోనూ రూ.3లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ



ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నయాగామ్, భోకర్, సోలాపూర్: అబద్ధాల పోటీలు పెడితే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశంలోనే మొదటి స్థానంలో నిలుస్తారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఛత్రపతి శివాజీ, జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయులు, బాలాసాహెబ్ ఠాక్రే , శరద్ పవార్ వంటి యోధులు జన్మించిన మహారాష్ట్ర నేలలో ఇప్పుడు విద్రోహులు రాజ్యమేలుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నయాగామ్, భోకర్, నాందేడ్‌లలో జరిగిన ప్రచార సభల్లో ప్రసంగించారు. సోలాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నయాగామ్‌లో మీనాల్ పాటిల్ ఖత్‌గావ్‌కర్.. భోకర్‌లో తిరుపతి కదమ్ కొండేకర్.. దక్షిణ సోలాపూర్‌లో చేతన్ నరోటే, నాందేడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో రవీంద్ర చౌహాన్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వీరుల నేలలో విద్రోహులు

ఆటో డ్రైవర్‌గా ఉన్న ఏక్‌నాథ్ శిందేను బాలాసాహెబ్ కుటుంబం మంత్రిని చేసిందని.. శరద్‌పవార్ కూడా సొంత కుమార్తెను కాదని అజిత్ పవార్‌ను ఉప ముఖ్యమంత్రి చేశారని సీఎం రేవంత్ చెప్పారు. అశోక్ చవాన్, ఆయన తండ్రి శంకర్‌రావు చవాన్‌లను కాంగ్రెస్ పార్టీ సీఎంలను చేసిందని పేర్కొన్నారు. కానీ ఈ ముగ్గురు విద్రోహులుగా మారి వీరుల నేలను అవమానాల పాలు చేశారని విమర్శించారు.

తెలంగాణలో 'సంక్షేమం'పై వాస్తవాల పరిశీలనకు సిద్ధం

తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతు ఆత్మహత్యలు అధికంగా జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వాటికి అడ్డుకట్ట పడిందని రేవంత్ చెప్పారు. తమ ప్రభుత్వం 50రోజుల్లోనే రూ.18 వేల కోట్ల రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో వేసిందన్నారు. దేశంలోనే అత్యధికంగా రైతుల ఆత్మహత్యలు మహారాష్ట్రలో జరుగుతున్నాయని.. ఆ ఆత్మహత్యలను నిలువరించాలన్నా, రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)ల మహా వికాస్ అఘాడీ కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కూటమి అధికారంలోకి రాగానే రూ.3 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను ఆదుకుంటామన్నారు. తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో ఉద్యోగ నియామకాలు, రుణమాఫీ, ఇతర సంక్షేమ కార్యక్రమాలు వాస్తవమో, కాదో కేంద్ర మంత్రులనో, అధికారుల బృందాలనో పంపి తేల్చుకొమ్మని సవాల్ విసిరారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమార్



తెలంగాణ సచివాలయం బాహుబలి మెయిన్ ఎంట్రన్స్ గేట్లను తొలగించిన దృశ్యం

కురుమూర్తికి పోటెత్తిన భక్తులు



గాజుల దుకాణంలో ..



జాతర మైదానంలో రద్దీ



క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఉద్దాల మండపం వద్ద..

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సెలువు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. గోవింద నామంతో కురుమూర్తి గిరులు మార్మోగాయి. తెల్లవారుజామునే ఆలయ అర్చకులు స్వామి వారికి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులతో క్యూలైన్ కిక్కిరిసిపోయింది. తమ ఇంటి ఇలవేల్పు అయిన స్వామి వారికి గండదీపాలు మోసి, పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

జోరుగా వ్యాపారం..

కురుమూర్తి జాతరలో వివిధ రకాల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. చిన్నారులు మొదలుకొని మహిళలు, పెద్దల వరకు వారికి కావాల్సిన వస్తువులు అందుబాటులో ఉండటంతో కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా మహిళలు వంట సామగ్రి, గాజులు, మిఠాయి దుకాణాల్లో సందడిగా గడుపుతున్నారు. అలాగే చిన్నారులు రంగుల రాటాన్లు, వాటర్ బోట్, స్ప్రింగ్ జంపింగ్ వాటిలో ఉత్సాహంగా ఆడుకుంటున్నారు. పెద్దలు సమీపంలోని కాల్చిన మటన్, మందు విందులతో మునిగి తేలుతున్నారు. ఈ ఏడాది జాతరలో వ్యాపారం జోరుగా సాగుతుండటంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జాతరలో స్టీల్ సామగ్రి కొనుగోలు చేస్తూ..





ఉత్సాహంగా గడుపుతున్న చిన్నారులు

న్యాయవాదుల రక్షణ చట్టం అమలులో విఫలం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇండియన్ అసోసియేషన్ లాయర్స్ యూనియన్ మహాసభలు జిల్లా అధ్యక్షుడు బి.పరమేశ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు జరుగుతున్నా ఇప్పటికీ రక్షణ చట్టం తీసుకురావడంలో ఆయా ప్రభుత్వాలు వెనుకడుగు వేస్తున్నాయన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి తెలంగాణ పోరాటంలో కూడా న్యాయవాదుల పాత్ర అమోఘమైనదని, కానీ వారిపై జరుగుతున్న దాడులకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికీ న్యాయవాదులు తమ వృత్తిని నిర్వహిస్తూనే సామాజిక అంశాల పట్ల స్పందిస్తున్న తీరును మరువలేనిదన్నారు. భారత రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయడంలో పాలకులు వెనుకంజ వేస్తున్నారని ఆరోపించారు. సెక్షన్ 41 సీఆర్పీసీని తక్షణమే ఎత్తివేయాలని, జూనియర్ న్యాయవాదులకు రూ.5 వేల స్టైఫండ్ ఇవ్వాలని, హెల్త్, డెత్ బెనిఫిట్ స్కీంను రూ.20 లక్షలకు పెంచాలని, ప్రతి జిల్లాలో న్యాయవాదులకు ఇల్లు కేటాయించాలని, హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలోని జిల్లా కోర్టులకు నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఐఏఎల్ ప్రజాస్వామిక వాదులతో ఏర్పడిన సంఘమని, స్థాపించిన వారిలో జస్టిస్ కృష్ణ అయ్యర్, జస్టిస్ పీఎన్ భగవతి, జస్టిస్ డీఎన్ దేశాయ్, జస్టిస్ చిన్నపరెడ్డి, పద్మనాభరెడ్డి ముఖ్యులని, వారి ఆశయ సాధనలో ఐఏఎల్ సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కం జనార్దన్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు తమ వృత్తి పట్ల నిబద్ధతతో ఉండి వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో విల్సన్, బి.రాము, దత్తాత్రేయ, రమేష్, ఆర్ఆర్ మన్యం, శేఖరయ్య, జేసీ కుర్మయ్య, నిరంజన్, సలీం, వెంకట్రావు, జగదీష్, రాజు, చేతన్, ఎన్వీ మహేష్, నరసింహ, రామకృష్ణగౌడ్, ఉబేద్, సజ్జత్ అమేద్, వేణుగోపాల్‌గౌడ్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్వీయ రక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ రవినాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి దాదాపు 400 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమితే, కతాస్, టీం కతాస్ తదితర అంశాల్లో పోటీలు జరగగా.. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పతకాలు సాధించారు. కరాటే చాంపియన్‌షిప్‌ను డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చన్నారు. నిహాన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆర్గనైజేషన్ ఇండియా చీఫ్ వి.రవీందర్‌కుమార్ మాట్లాడుతూ కరాటేకు ప్రస్తుతం ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల చదువులో కూడా ముందుంటారన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి కరాటే టోర్నీలో రాణించాలని కోరారు. అనంతరం టోర్నీలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ రవినాయక్, కరాటే మాస్టర్లు రవికుమార్, ఎంఎన్ విజయ్‌కుమార్, ఆయా రాష్ట్రాల మాస్టర్లు రాజేష్ (కర్ణాటక), విజయ్ (ఆంధ్రప్రదేశ్), షాహిన్ అన్సారీ (బీహార్) తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తాం

మక్తల్: ఉమ్మడి జిల్లాలోని కళాకారులకు ఏకతాటిపై తీసుకొచ్చి నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తానని జిల్లా నాటక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్రి చక్రధర్ అన్నారు. ఈమేరకు ప్రత్యేకంగా కళాకారుల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నాటక సమాఖ్య అధ్యక్షుడిగా కర్రి చక్రధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నారాయణచారి, కృష్ణయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో చింతల దిన్నె హన్మంత్‌రెడ్డి, శ్రీశైలం, జీకే గౌడ్, రాములు, రాధాకృష్ణ, నాగేష్, చిట్యాల లక్ష్మణ్, బాల్‌రాజ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, బీరప్ప పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు

జడ్చర్ల: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు 16 మంది బాలికలు ఎంపికయ్యారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ తెలిపారు. ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించిన ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది బాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా భార్గవి, శివానిచంద్ర, భవాని, మీనాక్షి, దీక్షిత, లావణ్య, బిందుప్రియ, నందిని, స్వప్ని, అనిత, మాధవి, అర్పిత, మహేక్, సౌమ్య, లోకేశ్వరి, హిమబిందు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు నిజామాబాద్ జిల్లా కల్లాడి జెడ్పీహెచ్ఎస్‌లో జరిగే 46వ అంతర్ జిల్లాల జూనియర్ బాలికల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన వారిని అసోసియేషన్ నాయకులు రాంరెడ్డి, సోయబ్ అలీ, అభిలాష్ తదితరులు అభినందించారు.